దిగులు తొలగిస్తూ.. ధీమానిస్తూ..

- బాధితులకు అండగా వైఎస్సార్ బీమా
- ఐదేళ్లలో 1,288 మందికి రూ.21.10 కోట్లు అందజేత
- పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి జగన్

వైఎస్సార్ బీమా

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు జమ
2019-20	231	3,87,84,681
2020-21	246	4,07,37,311
2021-22	257	4,29,48,778
2022-23	270	4,31,89,451
2023-24	284	4,54,10,000
మొత్తం	1,288	21,10,70,221


మృతుని కుటుంబానికి బీమా నగదును అందజేస్తున్న నాయకులు

గాజువాక : అనుకోకుండా ఏదైనా ప్రమాదం ముంచుకొచ్చి కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది. తిండి, నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుంది. భవిష్యత్ ఎంత కఠినంగా ఉంటుందో తలచుకొంటేనే గుండె పగిలినంత పని అవుతుంది.అటువంటి పరిస్థితిని ఏ కుటుంబం కూడా ఎదుర్కోకూడదని భావించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పెద్ద దిక్కు కోల్పోయిన స్థితిలో ఆ కుటుంబం వీధిన పడకూడదని ఆలోచించిన జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ బీమా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ బీమాతో రాష్ట్రంలో నిరుపేదలకు ఓ భరోసా ఏర్పడింది. తెల్ల రేషన్ కార్డు కలిగి 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సుగలవారందరికీ ఈ పథకం వర్తించే విధంగా రూపకల్పన చేశారు. ప్రమాదవశాత్తు మరణించినా, వృద్ధాప్యం కారణంగా మరణించినా, మరే ఇతర కారణాలతో మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా ఈ పథకం ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందుతుంది. కుటుంబంలో నామినీగా ఉన్న వ్యక్తికి ఆ సొమ్ము అందుతుంది. ఏదైనా ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షలు, 18–70 ఏళ్లలోపు వయస్సుగలవారు సహజ మరణం పొందినవారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. తక్షణ సాయంగా అంత్యక్రియలకు రూ.10వేలు అందించి, మిగిలిన సొమ్మును నామినీ ఖాతాలో జమ చేస్తారు. ఈ పథకం కింద గాజువాక నియోజకవర్గంలో ఐదేళ్లలో 1,288 మంది వివిధ కారణాలతో మరణించగా ప్రభుత్వం వారి నామినీల ఖాతాల్లో రూ.21.10 కోట్లను జమ చేసి ఆయా ప్రభుత్వాలకు అండగా నిలిచింది.

వైఎస్సార్ బీమా ఆదుకుంది



మాది చాలా పేద కుటుంబం. నా భర్త జలాల్ ఇంటింటికీ తిరిగి పిల్లలకు ఖురాన్ నేర్పించేవారు. వారి తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులతోనే మా జీవనం సాగేది. ఆయన ఆకస్మాత్తుగా మృతి చెందడంతో బతుకంతా చీకటి అయిపోయింది. జ్వరం వచ్చిందని అనగానే ఆస్పత్రికి తీసుకెళ్లాం. వైద్యానికి రూ.4 వేలు అవుతుందని ఆ ఆస్పత్రివారు చెబితే అది కూడా పెట్టుకోలేక కేజీహెచ్‌కు తీసుకెళ్లాం. అక్కడికి వెళ్లేసరికే ఆయన మృతి చెందారు. దీంతో నా చుట్టూ చీకటి అలుముకున్నట్టయింది. ఆ సమయంలో వైఎస్సార్ బీమా ద్వారా మాకు లక్ష రూపాయలు ఇచ్చారు. ఆ వెంటనే నాకు పెన్షన్ కూడా మంజూరు చేశారు. దీంతో మా జీవితంలో వెలుగొచ్చింది.

– ముంతాజ్ బేగం, గణేష్‌నగర్, గాజువాక

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఇటీవల నా తల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. తండ్రి పదేళ్ల కిందటే చనిపోయారు. దీంతో నేను, నా చెల్లెలు మిగిలాం. ఇద్దరం ఆడవాళ్లం కావడంతో ఇంటి దిక్కును కోల్పోయిన మాకు ఏం చేయాలో తెలియని సమయంలో మా ఇంటి పెద్ద దిక్కుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. ఏ భరోసా లేని మాకు వైఎస్సార్ బీమా ద్వారా ఆర్థికంగా ఆదుకున్నారు. లక్ష రూపాయల బీమాను కలిగి ఉన్నారని వలంటీర్ ఇంటికి వచ్చి తక్షణ సాయం కింద రూ.10 వేలు అందించి, మిగిలిన 90 వేల రూపాయలను నా బ్యాంకు ఖాతాలో జమా చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– కోరుకొండ నాగమణి, యాదవజగ్గరాజుపేట

వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం పలుకుదాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డి ఈ నెల 12న తొలిసారి గాజువాక రానున్నారని, ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకులతో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం 11 గంటలకు వైవీ సుబ్బారెడ్డి పాత గాజువాక జంక్షన్ వద్దకు చేరుకుంటారని, ఆయనకు స్వాగతం పలికేందుకు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని కోరారు. పాత గాజువాక నుంచి ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. అనంతరం పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, నాయకులు ధర్మాల శ్రీను, కులుకూరి మంగరాజు, రోజారాణి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి శంకరనారాయణ, గొందేశి వెంకటరమణారెడ్డి, యువశ్రీ, గొందేశి మహేశ్వర రెడ్డి, రాజు, బోగాది సన్నీ, కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశాఖ బంజారా అసోసియేషన్ నూతన కార్యవర్గం


ఎన్నికైన బంజారా అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉక్కునగరం: విశాఖ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆదివారం ఉక్కునగరం స్వర్ణజయంతి పార్కులో అసోసియేషన్ వార్షిక సాధారణ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ లెక్కలను ఆమోదించారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో అధ్యక్షుడిగా బీఎంకే నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ కృష్ణ, కోశాధికారిగా రత్నకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.శివరాం, సంయుక్త కార్యదర్శిగా డి.రాజు నాయక్, ఉపాధ్యక్షుడిగా ఎ.తిరుపతి నాయక్, సంయుక్త కార్యదర్శిగా ఆర్.తిరుపతి నాయక్‌తో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎస్. హనుమంతు నాయక్, బి. బాలాజీ, ఎం.లక్ష్మణ్, ఆర్.శంకర నాయక్, ఎస్.బలరామ్ ఎలక్షన్ కమిటీగా వ్యవహరించిన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను తరలించాలని ధర్నా


డంపింగ్ యార్డ్ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: ప్రజారోగ్యానికి హాని కలిగించే డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని పల్లా కార్తీక్ సేవా ట్రస్ట్ అధినేత పల్లా కార్తీక్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని రామచంద్రనగర్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ ఎదుట 16 గ్రామాల ప్రజలతో కలసి ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరి చివరన ఉండాల్సిన డంపింగ్ యార్డ్‌ను జనావాసాల మధ్య ఉండడంతో ప్రజలు అనారోగ్యంతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కొంత కాలంగా స్థానిక ప్రజలు ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే దీనిని తరలించాలని లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిత్యం హై'టెన్షన్'


తక్కువ ఎత్తులో ఉన్న హైటెన్షన్ వైర్లు

పెదగంట్యాడ : హైటెన్షన్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండడంతో నిత్యం టెన్షన్ పడుతున్నామని జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని మదీనాబాగ్, బుచ్చియ్యపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి పరదేశమ్మ ఆలయం మీద నుంచి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వరకూ నాలుగు రోడ్ల జంక్షన్‌లో 11కేవీ, 33కేవీ, ఎల్‌టీ 5 లైన్ల కోసం ఏర్పాటు చేసిన ఈ వైర్లు కిందకు వేలాడుతున్నాయని తెలిపారు. దీని కారణంగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో ఆ వైర్లు వాటికి తగిలి తెగిపోతున్నాయని, దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. అంతేకాకుండా గాలి వీచినపుడల్లా ఆ వైర్లు ఒకదానితో ఒకటి తగలడంతో నిప్పులు రాలుతున్నాయని, దీంతో అటుగా రాకపోకలు సాగించేందుకు భయపడాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 19న పరదేశమ్మ పండగ నిర్వహించనున్నామని, ఆ రోజు పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారని, ఆ సమయంలో వైర్లు తెగిపడి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ వైర్ల ఎత్తు పెంచాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు


వైఎస్సార్‌సీపీలోకి మహిళలను ఆహ్వానిస్తున్న సమన్వయకర్త చందు


వైఎస్సార్‌సీపీలోకి యువకులను ఆహ్వానిస్తున్న సమన్వయకర్త చందు


పార్టీలో చేరిన ఫార్మా ఉద్యోగులతో వైఎస్సార్ సీపీ గాజువాక ఇన్‌చార్జ్ చందు

గాజువాక : గాజువాకలోని వివిధ వార్డులకు చెందిన 200 మంది యువకులు, మహిళలు వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. పాతగాజువాకలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి పార్టీ సమన్వయకర్త ఉరుకూటి చందు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధిని స్వాగతిస్తూ యువత, మహిళలు పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో గాజువాకలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. 67వ వార్డు నుంచి చట్టి మురళి, 73వ వార్డు నుంచి నంబారు నగేష్‌ల సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు విజయలక్ష్మి, పి.శారద, టి.సాయమ్మ, ఉమ, ఆదిలక్ష్మి, సన్యాసమ్మ, లక్ష్మి, పావని, ఎన్.జి.రజిని, టి.లావణ్య, అశ్విని, ఎన్.బేబి రాణి, కె.అలేఖ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఫార్మా ఉద్యోగులు

అగనంపూడి: ఫార్మాసిటీకి చెందిన 50 మంది ఉద్యోగులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ నేత సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి చందు వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చందు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ఆకర్షితులై నియోజకవర్గంలో అన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ , నాయకులు మల్లేష్, శంకర్, అమ్మిరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, కోమటి సతీష్, పురుషోత్తమ్, ప్రసాద్‌రెడ్డి, రవిశంకర్, ఇంద్రసేన, శ్రీనివాస రావు, శ్రీనాథ్, నాయుడు, శ్రీకాంత్, దుర్గారావు, చింతా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి శంకుస్థాపన


తుంగ్లాంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ గాజువాక సమన్వయకర్త చందు

అక్కిరెడ్డిపాలెం : సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం 69వ వార్డులో రూ.1.65 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి బాటలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నడిపిస్తున్నారన్నారు. విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తూ దేశంలోనే ఏపీ ఆదర్శ రాష్ట్రంగా తీర్చి దిద్దారన్నారు. గాజువాక నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్ర రావు (చందు), వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు (సన్ని), నాయకులు కాకి అప్పల రెడ్డి, అంగ బాబూరావు, నావాన సింహాచలం, భెల్ (హెచ్‌పీవీపీ) ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, నర్సింగరావు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసినవి..

- తుంగ్లాంలోని ఎంఎం టవర్ వద్ద నుంచి గ్రామంలోకి రోడ్డు మరమ్మతులు, ప్యాచ్ వర్క్‌లకు రూ.19.93 లక్షలతో శంకుస్థాపన
- 69వ వార్డు నీలాపు వీధిలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.30లక్షలతో శంకుస్థాపన
- తుంగ్లాంలోని కళ్యాణ మండపం నిర్మాణంకు రూ.49.95 లక్షల వ్యయంతో శంకుస్థాపన
- చుక్కవానిపాలెం ప్రధాన రహదారి మరమ్మతులు, ప్యాచ్ వర్కులకు రూ.19.83 లక్షలతో శంకుస్థాపన
- తుంగ్లాంలోని సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల మరమ్మతులకు రూ.9.50 లక్షలతో శంకుస్థాపన
- శీలానగర్‌లోని రోడ్డు నంబర్ 2లో సీసీ రోడ్డు, ఎంబజీ–సీ32, ఎంబజీ–సీ22 వద్ద టాయిలెట్ల నిర్మాణానికి రూ.15.94 లక్షలతో శంకుస్థాపన
- శీలానగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రోడ్డు విస్తరణ పనులు, ఆర్‌సీసీ కల్వర్టుల నిర్మాణానికి రూ.19.98 లక్షలతో శంకుస్థాపన.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు మహిళా ఉద్యోగుల నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ ఉద్యోగినుల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నూతన వేతనాల అమలు కోసం యువ ఉద్యోగులు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. వేతనాల అమలుపై యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమాల్లో భాగంగా ఈసారి మహిళా ఉద్యోగులు ప్రత్యేకంగా నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఎల్‌డీసీ విభాగం వద్ద నిర్వహించనున్న కార్యక్రమంకు యువ ఉద్యోగులందరూ హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


కూర్మన్నపాలెంలో రూట్ మార్చ్ చేస్తున్న సీఐఎస్ఎఫ్, దువ్వాడ పోలీస్ పోలీసులు

కూర్మన్నపాలెం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దృష్టిలో పెట్టుకుని ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూట్ మార్చ్‌ను నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో జీవీఎంసీ 86, 87 వార్డుల పరిధిలోని వడ్లపూడి, కూర్మన్నపాలెం, సిద్ధార్థనగర్, రాజీవ్‌నగర్, వుడా ఫేజ్–2 తదితర ప్రాంతాల్లో పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. ప్రజల్లో ఓటు వినియోగంపై అవగాహన కలిగించామని సీఐ ఎర్రంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో దువ్వాడ ఎస్ఐ శ్రీనివాసరావు, క్రైమ్ ఎస్ఐ కాళిదాసు, పోలీస్ సిబ్బంది, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పూలే సేవలు అజరామరం


సావిత్రిబాయి పూలే చిత్ర పటంవద్ద నివాళులర్పిస్తున్న చందు తదితరులు


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి


పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక : తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే భారతదేశానికి అందించిన సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆమె వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడారు. భర్త మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ఆమె అట్టడుగు వర్గాల మహిళలకు చదువు చెప్పడంతో పాటు వారి హక్కులపై కూడా అవగాహన కల్పించిన మహోన్నత వ్యక్తి అన్నారు. 1848లో ఆమె మొట్టమొదటిగా పాఠశాలను స్థాపించి విద్యాబోధన చేశారన్నారు. మానవ హక్కులు, ఇతర సామాజిక సమస్యలపై మహిళలను చైతన్యపర్చడానికి 1852లో మహిళా సేవా మండల్‌ను స్థాపించి ఎనలేని కృషి చేశారన్నారు. సామాజిక విప్లవకారిణిగా ఆమె పలు కార్యక్రమాలను నిర్వహించారన్నారు. దేశంలో మహిళలు ఇళ్ల బయటకు రావడానికి ఇబ్బంది పడే రోజుల్లో తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పిన అభ్యుదయ వ్యక్తి జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు. వారి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పూర్ణానంద శర్మ, రెడ్డి జగన్నాథం, ఎలమంచిలి అప్పారావు, కుప్పిలి సత్యనారాయణ, కర్రి ప్రసాద్, గంటిపిల్లి అమ్మోరు, గండి అప్పలరాజు, నీలాతి అచ్చిబాబు, బాబులు నాయుడు, సత్యవతి, తిప్పల స్వాతి, ఆదిలక్ష్మి, పూడి శాంతి, సంతోషి, భవాని, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేం

పెదగంట్యాడ: సావిత్రిబాయి పూలే సేవలు మరువలేమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వుడా కాలనీ వినాయకనగర్‌లో యాత శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన సంక్షేమ సంఘం అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు చీరలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ రోడ్డులో..

స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, నాయకులు మార్టుపూడి పరదేశి, రోజారాణి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి శంకరనారాయణ, ధర్మాల శ్రీను, యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు అప్పికొండ కాలనీలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎన్నేటి రమణ ఆధ్వర్యంలో స్వర్గీయ సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు, మార్పు శేషు, ముద్దపు దామోదర్, ఎస్సీ సెల్ నాయకుడు గాలి నూకరాజు, బీసీ సెల్ నాయకుడు ద్వారంపూడి బ్రహ్మం, బోండా గోవిందరాజులు, సారిపిల్లి గణపతి, పోలారపు గోవిందు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెంచీల వితరణ



బెంచీలు అందించిన దాతలను సత్కరిస్తున్న వాకింగ్ ట్రాక్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: వందల మంది వాకర్స్‌కు వీలుగా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీర్చిదిద్దాలని అగనంపూడి వాకర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు మడగల నరసింగరావు కోరారు. వాకర్స్ సేదతీరడానికి వీలుగా దాతలు బెంచీలు అందించారు. దాతలు విందుల కరుణాకరావు, చిన్ని కనకారావు, సింగపూర్ శేఖర్‌లను వాకర్స్ అసోసియేషన్ ఈ సందర్భంగా సత్కరించింది. నరసింగరావు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం కనీస వసతులు కల్పించడానికి ముందుకు రాకపోయినా దాతల సహకారంతో వసతులు ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. అగనంపూడిలో నివాసముంటున్న ఉక్కు, ఫార్మా ఉద్యోగులు, మహిళలు నిత్యం వందలాది మంది వాకింగ్ చేస్తున్నారని, ట్రాక్‌కు స్థలం కేటాయించిన ఉక్కు యాజమాన్యం కనీస వసతులు కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కరణం పైడిరాజు, బలిరెడ్డి సత్యనారాయణ, బత్తుల కాళిదాస్, చిన్ని పూర్ణ, చట్టి నరసింగరావు, అట్టా మంగరాజు, దొడ్డి దేముడు, జెర్రిపోతుల అప్పారావు, పిళ్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్పానికి కేంద్రం తలవంచక తప్పదు

కూర్మన్నపాలెం : ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం పోరాటాల పురిటి గడ్డ అయిన విశాఖ ఉక్కు పట్ల కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసిన ప్రజా ఉద్యమాల ముందు తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు 1,123వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, హెచ్ యం యస్ యూనియన్ నాయకులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలుపుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే అధికారులుకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకు వచ్చిన అడ్డుకుంటామని, పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా ఏర్పడిన సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, హెచ్.యం.యస్ యూనియన్ ప్రతినిధులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గొయ్యి తవ్వి వదిలేశారు..


ప్రమాదకరంగా మారిన గొయ్యి

అగనంపూడి: అగనంపూడి షిర్డీసాయి బాబా ఆలయం సమీపంలో రోడ్డుపై వారం రోజుల క్రితం గొయ్యి తవ్వి వదిలేశారు. 8 అడుగుల లోతులో ఆరడుగుల వెడల్పుతో పైప్‌లైన్ మరమ్మతుల కోసం గొయ్యి తవ్వారు. రహదారి మలుపులో ఈ గొయ్యి ఉండడంతో వాహనాలు అదుపుతప్పుతున్నాయి. రాత్రి వేళల్లో మరింత ప్రమాదకరంగా మారింది. ఆదివారం పలు వాహనాలు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని పలువురు కోరుతున్నారు.